భూదాన్ బాధితుల ఆందోళన

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

నందిగామ, ఫిబ్రవరి 3 : మండల కేంద్రంలో భూదాన్ భూ బాధితులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1975లో భూదాన్ భూమి పొందిన రైతులకు ఇప్పటివరకు అధికారులు పట్టాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం పద్ధతి కాదన్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూదాన్ భూముల రైతులకు పట్టాలు వచ్చే వరకు వారికి మద్దతుగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు కావలి శ్రీనివాస్, వెంకటయ్య, నర్సయ్య, యాదయ్య, చంద్రయ్య, పోచయ్య, అంజయ్య, భీమయ్య, కృష్ణ, నర్సింహులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను అధిగమించాలి

ముకునూరులో నీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 3 : మండల పరిధిలోని ముకునూరులో వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రజిత సూచించారు. సోమవారం స్పెషల్‌డ్రైవ్ కింద గ్రామంలో నీటి సమస్య ఉందా... ఉంటే ఎలా పరిష్కరించాలనే అంశంపై ముందస్తు ప్రణాళిక కోసం పంచాయతీ కార్యదర్శితో కలిసి ఆమె పర్యటించారు. మిషన్ భగీరథ నీటితో పాటు గ్రామంలో ఉన్న పంచాయతీ మోటర్ల ద్వారా గ్రామంలోని ఇంటింటికీ నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ రైతు భరోసా ఇవ్వాలి

మాట్లాడుతున్న బీకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 3 : ప్రభుత్వం అర్హులందరికీ రైతు భరోసా ఇవ్వాలని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి అన్నారు. సోమవారం షాబాద్‌లోని రైతు వేదికలో బీకేఎస్ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం మండలానికి ఒక గ్రామానికి మాత్రమే రైతు భరోసా అందించడం విడ్డూరంగా ఉందన్నారు. కుటుంబ యూనిట్ కాకుండా రైతులందరికీ రైతు భరోసా అందించాలని కోరారు. అలాగే గ్రామాల నక్షలో ఉన్న, రెవెన్యూ రికార్డుల్లో ఉన్న బాటలు, కాల్వలు గ్రామీణ ఉపాధి పథకంలో చేర్చి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో బీకేఎస్ జిల్లా కమిటీ మెంబర్ వెంకట్ రెడ్డి, షాబాద్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గౌతమ్, రైతులు భీమయ్య, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే గన్‌మన్ మృతి

కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేత

శ్రీనివాస్ (ఫైల్)

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 3 : రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే గన్‌మన్ మృతి చెందాడు. ఈ ఘటన వెలిమెల తండా శివారులో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. శంకర్‌పల్లి మండల పరిధిలోని బుల్కాపూర్‌కు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య గన్‌మెన్ ముత్తంగి శ్రీనివాస్ (28) వికారాబాద్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్. ప్రస్తుతం చేవెళ్ల ఎమ్మెల్యే గన్ మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం కొండకల్ గ్రామం నుంచి వెలిమెల వరకు తన బైక్‌పై వెళ్తుండగా, వెలిమెల తండా గ్రామ శివారు వద్దకు రాగానే మార్గం మధ్యలో అడవి పంది బైక్‌కు అడ్డు రావడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పటాన్ చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

కుటుంబ సభ్యులను పరామర్శించి

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య పటాన్‌చెరులోని ప్రభుత్వ దవాఖానలో మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు రూ.50 వేలు ఆర్థిక సాయం అంజేశారు. అనంతరం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీనివాస్ గత నాలుగేండ్లుగా నా దగ్గర గన్‌మెన్‌గా పని చేస్తున్నాడని, డ్యూటీలో సమయ పాలన పాటిస్తూ అందరితో స్నేహపూర్వకంగా మెలిగేవాడని, తన మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని తెలిపారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలి

సమావేశంలో మాట్లాడుతున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.

ఆమనగల్లు, ఫిబ్రవరి 3: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. ఆమనగల్లు మండల పరిషత్తు కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం కల్వకుర్తి నియోజకవర్గంలోని ఏడు మండలాలు కల్వకుర్తి, వెల్దండ, చారకొండ, ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్లు, రుణ మాఫీ, ఫించన్లు, రేషన్‌కార్డులు రైతు భరోసా, కారొరేషన్ కల్యాణలక్ష్మీ, తదితర పథకాలపై సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, సాగునీటి పారుదల, వ్యవసాయ శాఖ, ఆరోగ్య శాఖ, పోలీస్, ఎక్సైజ్, పారెస్టు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాటమయ్య కిట్లు అందజేత

మాడ్గుల : ఎక్సైజ్ శాఖ, బీసీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో పీసీబీ సభ్యుడు ఠాగూర్ బాలాజీ సింగ్, తహసీల్దార్ వినయ్ సాగర్, ఎంపీడీవో పద్మావతి, బీసీ శాఖ అధికారులు మాధవ రెడ్డి, రవీందర్, ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్, మాజీ ఏఎంసీ చైర్మన్ బట్టు కిషన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హరికుమార్‌కు సర్వోత్తమ పరిశోధన పురస్కారం

హరికుమార్

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 3 : సెయింట్ మేరీస్ ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ నామ హరికుమార్‌కు భౌతిక శాస్త్రం సంక్షేమ సంఘం (పీటీడబ్ల్యూఏ) 2024 సంవత్సరానికి సర్వోత్తమ పరిశోధన పురకస్కారాన్ని ప్రకటించింది. ఈ పురస్కారాన్ని, ప్రశంసా పత్రంతో పాటు మెమోంటోను ఉస్మానియా యునివర్సిటీ భౌతిక శాస్త్రం విభాగంలో అందుకున్నారు. 2024లో 12 వ్యాసాలు రచించి వాటిని స్కోపస్ ఇండెక్స్ పత్రికల్లో ప్రచురించారని హరికుమార్ తెలిపారు. పరిశోధన, భౌతిక శాస్త్రంపై మక్కువ ఉన్న వారికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఉత్తమ పరిశోధన పురస్కారం రావడం సంతోషంగా ఉందన్నారు. ఆయన పట్టుదల, శ్రమను గుర్తించి ఈ పురస్కారాన్ని బహూకరించడంతో సోమవారం కళాశాలలో సెక్రటరీ, డీన్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, కుటుంబ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

కట్టమైసమ్మ ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

- ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- నల్ల చెరువు కట్టమైసమ్మ ఆలయ ప్రారంభోత్సవం

షాబాద్, ఫిబ్రవరి 3: ఆలయాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శిథిలావస్థ ఆలయాలను అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. షాబాద్ మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామంలో ఉన్న నల్ల చెరువు కట్ట మైసమ్మ ఆలయాన్ని అంతిరెడ్డిగూడ గ్రామానికి చెందిన దాత నేరెట్ల పరిపూర్ణ, మహేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులు రూ.50లక్షలతో నిర్మాణం చేయడంతో సోమవారం ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శిథిలావస్థలో ఉన్న ఆలయాలను అభివృద్ధి చేసుకొని, ధూప, దీప నైవేద్యాలను కొనసాగించడం మంచి పరిణామమన్నారు. ఈ ప్రాంతంలో నల్ల చెరువు కట్టమైసమ్మ ఆలయం అతి ప్రాముఖ్యత కలిగి ఉందన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయాన్ని తీర్చిదిద్దడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, వెంకటయ్య, సత్యనారాయణ, సూద యాదయ్య, శేఖర్, రాజుగౌడ్, విక్రంరెడ్డి, నర్సింహులు, పాండు, సత్తిరెడ్డి, వెంకట్‌రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

మహా ప్రదర్శనకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు

కడ్తాల్, ఫిబ్రవరి 3: సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఈ నెల 7న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'లక్షల డప్పులు-వేల గొంతులు' మహా ప్రదర్శనకు సంబంధించిన కరపత్రాలను, సోమవారం రాత్రి మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ 30 ఏండ్లుగా పోరాటం చేస్తున్నారని తెలిపారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును దేశంలోనే అందరి కంటే ముందు తెలంగాణలోనే అమలు చేస్తామని, అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు నరేశ్, గ్రామాధ్యక్షుడు శ్రీకాంత్, మాజీ సర్పంచ్ కృష్ణయ్యయాదవ్, నాయకులు మహేశ్, రాజశేఖర్, రమేశ్, సాయి, కృష్ణ తదితరులు ఉన్నారు.

మహా ప్రదర్శన వాల్‌పోస్టర్ విడుదల

మాడ్గుల :ఎమ్మార్పీఎస్ వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

మాడ్గుల, ఫిబ్రవరి 3 : హైదరాబాద్‌లో ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే మహా ప్రదర్శన కార్యక్రమానికి సంబంధించి వాల్‌పోస్టర్లను సోమవారం మండల పరిధిలోని కలకొండలో ఆ పార్టీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహా ప్రదర్శనకు మాదిగలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాయిని సత్యనారాయణ, గ్రామ అధ్యక్షుడు తానేశ్, నాగేశ్, శ్రీను, మహిపాల్, వెంకటయ్య, సైదులు, నాగరాజు, నవీన్, శ్రీను, యాదయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభం

మేడిగడ్డలో మిషన్ భగీరథ ట్యాంకు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ అనిత

ఆమనగల్లు, ఫిబ్రవరి 3 : మండల పరిధిలోని మేడిగడ్డలో సోమవారం మాజీ ఎంపీపీ అనిత మిషన్ భగీరథ ట్యాంకు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో నియోజకవర్గ నిధులు నూ.7 లక్షలతో తాగునీటి పనులు చేపట్టినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో కేఎస్ఆర్ యువసేన జిల్లా అధ్యక్షుడు విజయ్‌రాథోడ్, గ్రామ ప్రత్యేక అధికారి వినోద, ఏఈ శరత్, మాజీ ఎంపీటీసీ పరమేశ్, మాజీ ఉపసర్పంచ్ మల్లేశ్, నాయకులు రాంజ్య, గేమ్య, పాండు, మాల్యానాయక్, శ్యామ్, కిషన్, దేశ్య, రాజు, లాలు, సిద్ధు, నరేశ్, కౌశిక్, తదితరులు పాల్గొన్నారు.

మహిళ పై ప్రైవేట్ ఉద్యోగి అసభ్య ప్రవర్తన

కేశంపేట, ఫిబ్రవరి 3 : భర్త మృతి చెందిపుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబం ఫైనాన్స్ చెల్లించకపోవడంతో ఆమె పట్ల పిన్ కేర్ ఫైనాన్స్ ఉద్యోగి ప్రవర్తించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా చేసింది. స్థానికుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే.. పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన కొందరు ఫిన్‌కేర్ ఫైనాన్స్‌లో డబ్బులను అప్పుగా తీసుకున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఓ వ్యక్తి మృతి చెందడంతో ఆ కుటుంబం ఫైనాన్స్ డబ్బులను చెల్లించలేక పోయిందని, ఈ విషయమై ఆగ్రహించిన ఫిన్‌కేర్ ఫైనాన్స్ ఉద్యోగి ఆ మహిళ పట్ల రాయలేని బూతుమాటలు తిట్టాడని పేర్కొన్నారు. ఉద్యోగి బూతు మాటలను అప్పుగా తీసుకున్నవారికి చెప్పడంతో ఆగ్రహించిన గ్రామస్తులు బూతులు తిట్టిన వ్యక్తి వచ్చి క్షమాపణ చెప్పే వరకు తాము తీసుకున్న నగదును ఒక్కపైసా కట్టేదిలేదని భీష్మించుకు కూర్చున్నారు. ఫిన్‌కేర్ ఫైనాన్స్ మేనేజర్ కిషన్‌రావు గ్రామస్తుల వద్దకు వచ్చి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఆగ్రహంతో ఉన్న గ్రామస్తులు బూతులు తిట్టిన వ్యక్తి వచ్చి క్షమాపణలు చెప్పే వరకు డబ్బులు కట్టబోమని చెప్పడంతో అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మొయినాబాద్, ఫిబ్రవరి 3 : రోడ్డు ప్రమాదంలో గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు సోమవారం మృతి చెందాడు. ఎస్సై నర్సింహారావు తెలిపిన వివరాలు.. బిహార్ రాష్ట్రానికి చెందిన ఎండీ అశ్రఫ్ (30) బతుకుదెరువు కోసం వలస వచ్చి నజీబ్‌నగర్ సమీపంలోని ఓ ఫామ్ హౌస్‌లో నివాసం ఉంటూ మేస్త్రీ పని చేస్తున్నాడు. శనివారం రాత్రి స్నేహితులు ఇమ్రాన్, అస్గర్‌తో కలిసి బైక్‌పై వెళ్తున్నారు. నజీబ్‌నగర్ సమీపంలోని ఓ మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న క్వాలీస్ వాహనాన్ని ఢీకొన్నారు. అశ్రఫ్ తలకు బలమైన గాయం కావడంతో చికిత్స కోసం నగరంలోని దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ అశ్రఫ్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి బాబాయ్ ఎండీ ఇజాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నామని తెలిపారు.

యాచారం : నందివనపర్తిలో..

జిల్లాలో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం పలు ఆలయాల్లో సరస్వతీ దేవికి ప్రత్యేక ప్రజలు చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు చెక్క భజన, కోలాటాల ప్రదర్శన నిర్వహించారు.

- న్యూస్ నెట్‌వర్క్, రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 3

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

ఆమనగల్లు, ఫిబ్రవరి 3 : ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వేసవిలో మెరుగైన విద్యుత్ నిరంతరంగా సరఫరా చేసేందుకు కందుకూర్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు రాజేంద్రనగర్ ఎస్ఈ శ్రీరామ్‌మోహన్ అధ్యక్షతన సమావేశం ఉంటుందని కందుకూర్ డివిజనల్ ఇంజినీర్ గోపాల కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి డివిజన్‌లోని కందుకూర్, మహేశ్వరం, పహడిషరీఫ్, బాలాపూర్, ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల్ సంబందించిన వినియోగదారుల హాజరు కావాలని తెలిపారు.

హైమాస్ట్ వెలగదు.. చీకటి తొలగదు

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 3: మున్సిపాలిటీ పరిధిలోని తట్టిఅన్నారంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు సరిగ్గా వెలగక చీకట్లు కమ్ముకుంటున్నాయి. హైమాస్ట్ స్తంభానికి నాలుగు లైట్లు ఉండగా.. కేవలం ఒక్కటే అదీ అరకొరగా వెలుగుతున్నది. రోడ్డుపై చీకట్లు కమ్ముకుని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి, వెలుగులు నింపేలా చూడాలని, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైతు బజార్లలో రైతులకు అధిక ప్రాధాన్యం

ఆర్కేపురం, ఫిబ్రవరి 3 : రైతు బజార్లలో అధిక ప్రాధాన్యం కల్పించి రైతులకు వినియోగదారులకు నష్టం కలగనివ్వమని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం కొత్తపేటలోని రైతు బజార్‌ను ఆయన పాలకవర్గంతో కలిసి సందర్శించి రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు బజార్లలో సమస్యలు లేకుండా చూసే బాధ్యత అధికారులదేనని తెలిపారు. ధరల పట్టిక ప్రకారం అయ్యాలని సూచించారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డికి అమ్మవారి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఆర్కేపురం, ఫిబ్రవరి 3 : ఆధ్మాతికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్ టెలిఫోన్ కాలనీలోని శ్రీ జ్ఞానసరస్వతీ దేవాలయం స్థాపించి పుష్కర కాలం అయిన సందర్భంగా దేవాలయ కమిటీ, కాలనీ అసోసియేషన్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో పుష్కర కుంభాభిషేక మహోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అంతకు ముందు ఆలయ కమిటీ ప్రతినిధులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవిందశర్మ, డివిజన్ అధ్యక్షులు పెం డ్యాల నగేశ్, నాయకులు న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్, ఎంఏ సాజీద్, శ్యామ్‌గుప్తా, నవీన్, మహిళా అధ్యక్షురాలు లిక్క ఊర్మిళా రెడ్డి, స్వప్న, అనూరాధ, ఆలయ చైర్మన్ వరప్రసాద్, సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి రాములు, కాలనీ అసోసియేషన్ సభ్యులు సంజీవరెడ్డి, అరవింద్ కుమార్, లక్ష్మయ్య, రమణ, వాసవి, కరుణ, సృజన తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

మృతి చెందిన రైతు కుటుంబానికి రూ. 15వేల ఆర్థిక సాయం అందజేస్తున్న చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ యాదవ్

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 3 : బాటసింగారం రైతు సేవా సహకార సంఘంలో సభ్యులైన రైతులు మరణిస్తే వారి కుటుంబాలకు సంఘం తరఫున ఆర్థిక సాయం అందజేస్తున్నామని చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ యాదవ్ తెలిపారు. పిగ్లీపూర్ గ్రామానికి చెందిన దుర్గం మల్లయ్య 2020 జూలై 4న మృతి చెందాడు. ఆయన భార్య దుర్గం మల్లమ్మకు మండల కేంద్రంలోని సంఘం ప్రధాన కార్యాలయంలో సోమవారం చైర్మన్ రూ.15వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు కుటుంబాలకు సహకార సంఘం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డైరక్టర్ మొగుళ్ల యాదిరెడ్డి, పరిసర గ్రామాల నాయకులు నల్లంగల్ల మధు, కర్రె కృష్ణ, భీమగోని గౌరీశంకర్, జాపాల బాలకృష్ణ, సుర్వి అనంద్‌గౌడ్, అకౌంటెంట్ మోడెపు రాకేశ్‌గౌడ్, రైతులు తదితరులు ఉన్నారు.

కరాటేలో సత్తాచాటిన అక్కాచెల్లెళ్లు

హర్షిణి

వైష్ణవి

మొయినాబాద్, ఫిబ్రవరి 3 : కరాటే అంటే అక్కాచెల్లెళ్లకు ఎంతో ఆసక్తి . కరాటేలో పతకాలు సాధించాలని ఇద్దరు లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో నిర్వహించే కరాటేపోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో భాగంగా అక్కా సిల్వర్ మెడల్ సాధించగా, చెల్లెలు గోల్డ్ మెడల్ సాధించింది. మొయినాబాద్ మండల పరిధిలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన నాంచేరి మహానంద్‌గౌడ్ పెద్ద కూతురు నాంచేరి హర్షిణి 8వ తరగతి చదువుతున్నది. చిన్న కూతురు వైష్ణవి 6వ తరగతి చదువుతున్నది. గతంలో ఇద్దరు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో జరిగిన కరాటే పోటీల్లో పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొని అక్క హర్షిణి సిల్వర్ మెడల్ సాధించగా, చెల్లెలు వైష్ణవి గోల్డ్ మోడల్ సాధించారు. తమ ఇద్దరు పిల్లలు కరాటేలో పతకాలు సాధించడంతో తండ్రి మహానంద్‌గౌడ్ కూతుళ్లను అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

తారామతిపేటలో క్రీడా పోటీలు ప్రారంభం

క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 3: మున్సిపాలిటీ పరిధిలోని తారామతిపేటలో తారామతిపేట ప్రీమియర్ లీగ్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా క్రీడాకారులు గెలుపోటములను సమానంగా భావించి, క్రీడా స్ఫూర్తిని చాటాలని నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, గ్యారాల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో చేగూరి కృష్ణ, అచ్చిన కృష్ణ, పెదపాక యాదయ్య, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో సామాన్యుల సంక్షేమమేది?

- కేంద్రప్రభుత్వంపై భగ్గుమన్న సీపీఎం
- ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం

కందుకూరు, ఫిబ్రవరి 3 : కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ ప్రయోజనాలకు ఉపయోగపడేలా ఉందని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుబ్బాక రామచందర్ మండిపడ్డారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ సోమవారం కందుకూరులో సీపీఎం ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సామాన్య ప్రజలకు లబ్ధి చేకూరేలా బడ్జెట్ లేదని తెలిపారు. వ్యవసాయ రంగానికి కేటాయింపులు తక్కువగా ఉన్నాయన్నారు. విద్య, వైద్య, రంగాలకు ఆశించిన నిధులు కేటాయించలేదని చెప్పారు. తెలంగాణకు నిధులు కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపినట్లు స్పష్టంగా కనిపిస్తుందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్, నాయకులు మంజయ్య, శేఖర్, సత్యం, అరుణ,జంగమ్మ, రాజమణి, మహేందర్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

**పేదలకు ఇండ్ల స్థ